అర్హతలేని అదృష్టం

వసుంధర

ఆ యింట్లో ముగ్గురే వున్నారు. సీతారామయ్య, అతడి భార్య రుక్మిణి, కూతురు మనోరమ. తెల్లవారుఝామున నాలుగింటికి ఎవరో ఆ యింటి తలుపులు తడుతూంటే ముగ్గురికి ముగ్గురూ గాఢనిద్రలో వున్నారు. చివరకు మనోరమే లేచి కళ్ళు నులుముకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

ఒక యువకుడు విసుగ్గా లోపల ప్రవేశించి—"అవతల తెల్లారిపోతూంటే ఇంకా ఇంత నిద్రేమిటి?" అన్నాడు.

"ఎవరైనా తెల్లవారుఝామునే మంచి నిద్రలో వుంటారు"—అంది మనోరమ ఇంకా కళ్ళు నులుముకుంటూనే.

"పోనీ తలుపుతట్టిన అరగంటకైనా మెలకువరాదా?" అన్నాడా యువకుడు చిరాగ్గానూ, విసుగ్గానూ.

అప్పటికి మనోరమకు కాస్త మత్తు విడినట్లుంది. అతడి వంక చూసి ఆశ్చర్యంగా—"ఎవరండీ మీరు?" అంది.

ఇప్పుడాశ్చర్యపడడం ఆ యువకుడి వంతైంది—

"నువ్వు నన్ను—ఎవరని అడుగుతున్నావా?" అన్నాడు.

"ఇందులో ఆశ్చర్యమేముంది? మీ రెవరో నాకు తెలియదు."

"నేను నీ భర్తను. ఇప్పుడైనా గుర్తొచ్చిందా?" అన్నాడతడు.

"మీ రెవర్ని మాసి ఎవరనుకుంటున్నారో—నాకింకా పెళ్ళికాలేదు...." అంది మనోరమ అతడినే పరీక్షగా గమనిస్తూ.

"ఏమయింది నీకు అనూ?" అన్నాడా యువకుడు మళ్ళీ.

"అనూ ఏమిటి—నా పేరు మనోరమ."

"కాదు—నీ పేరు అనూరాధ" అన్నాడతడు.

"అయితే నీ పేరు విశ్వంగానీ కాదుకదా!" అంది మనోరమ చటుక్కున.

"ఇంకేం—నన్ను గుర్తుపట్టావన్న మాట. కలికాలం ఇలా ఏడ్చింది—పుట్టింట్లో నాలుగురోజులుండేసరికి తాళి కట్టిన భర్తల్నే మరిచిపోతున్నారు భార్యలు" అన్నాడు విశ్వం.

అతడి మాటలు పట్టించుకోకుండా —."అక్కేదీ?" అంది మనోరమ.

"అక్కెవరు?" అన్నాడు విశ్వం.

"మా అక్క పేరు అనూరాధ. తననుకూడా తెస్తే తప్ప నువ్వు మా బావ వనడానికి సాక్ష్యంలేదు" అంది మనోరమ.

"నాకు తెలిసిన అనూరాధవు నువ్వే!" అన్నాడు విశ్వం.

మనోరమకు సిగ్గేసినట్లుంది. ఆమె అతడిని కూర్చోమని

లోపలకు వెళ్ళి తలిదండ్రులను నిద్రలేపి విషయం చెప్పింది. వాళ్ళిద్దరూ ఒక్క ఉదుటున అతడిని చూడ్డానికి వచ్చారు. రుక్మిణి విశ్వాన్ని చూసి—"అల్లుడు బాగానే ఉన్నాడు" అని భర్త చెవిలో గుసగుస లాడింది. అది విశ్వం విన్నాడు.

విశ్వం అత్తగారికీ మామగారికీ నమస్కరించి—"నేను అనూరాధను తీసుకెళ్ళాలని వచ్చాను" అన్నాడు.

సీతారామయ్య తెల్లబోయి—"అనూరాధను తీసుకొని వెళ్ళడమేమిటి? అది నీ దగ్గరే వుందిగా" అన్నాడు.

"ఎదురుగా అనూరాధ వుంటే—నా దగ్గర ఉందంటా రేమిటి?" అన్నాడు విశ్వం ఆదోలా.

"ఇది అనూరాధ కాదు. మనోరమ. నువ్వు పొరబడడంలో ఆశ్చర్యం లేదులే.... వాళ్ళిద్దరూ కవలపిల్లలు. ఇద్దరికీ తేడా మాకే తెలియదు" అన్నాడు సీతారామయ్య.

అప్పుడు తెల్లబోవడం విశ్వం వంతయింది.

తన ఊళ్ళో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూండేది అనూరాధ. ఆమెనోసారి సినిమాహాలు దగ్గర చూసి ఆకర్షితుడయ్యాడతడు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. అనూరాధ తలిదండ్రులకు విశ్వం ఉత్తరం రాశాడు. అందుకు చాలా కఠినంగా బదులిచ్చాడు సీతారామయ్య. ఆ పెళ్ళి జరిగితే కూతురిముఖం చూడనన్నాడు. తనకు మైనారిటీ తీరింది కాబట్టి తలిదండ్రుల అనుమతి అవసరం లేదంది అనూరాధ. ఇద్దరూ ఆ ఊళ్ళోనే గుళ్ళో పెళ్ళి చేసుకున్నారు. విశ్వానికి తండ్రి లేడు. తల్లిమాత్రం ఆ వివాహాన్ని కామోదించింది. ఇద్దరూ కాపురం పెట్టాక సీతారామయ్య కూతురికి ఉత్తరం రాశాడు. అయిందేదో అయిపోయింది కాబట్టి జరిగిన

వన్నీ మర్చిపోదామని ఆయన రాస్తే అనూరాధ పుట్టింటికి వెళ్ళింది.

“నేను దాని కుత్తరం రాసినమాట నిజం. కానీ అందుకది బదులుగా ఏం రాసిందో నువ్వే చూడు”....అంటూ సీతారామయ్య ఓ ఉత్తరం తెచ్చి విశ్వానికందించాడు. విశ్వం అది చదువుతున్నాడు.

“పగిలిన అద్దం విరిగిన మనసు—రెండూ అతుక్కోవు. ఇక మీకూ నాకూ ఏ సంబంధమూ లేదు.”

రెండే రెండు వాక్యాలున్నాయందులో.

“అయితే పుట్టింటికని బయల్దేరిన అనూరాధ ఏమైంది?” అన్నాడు విశ్వం.

అందరూ ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

2

విశ్వం అత్తవారింట్లో రోజంతా గడిపాడు. అనూరాధ తీసుకొని వెళ్ళడం మరిచిపోయిందని అతడు పెళ్ళిఫోటోలు కూడా తెచ్చాడు. అవి చూసి రుక్మిణి యెంతో సంబరపడి—“అచ్చం పెళ్ళి చూస్తున్నట్లే వుంది. ఇవి మాకొదిలేసి వెడతావా?” అనడిగింది.

“నాదగ్గర నెగెటివ్సున్నాయి. ప్రింటుతీసి పంపిస్తాను. కానీ అనూరాధ ఏమయిందీ అన్న విషయం ముందు తేలాలి” అన్నాడు విశ్వం.

సీతారామయ్య కాసేపాలోచించి—“అనూరాధ నీ యింట్లోనే వుంది. అది మాకు కటువుగా ఉత్తరం రాసిందనీ నీకు తెలుసు. మాతో గొడవపడ్డం నీకిష్టంలేదు. అందుకని అది పుట్టింటికని బయల్దేరినట్లు మాకు అబద్ధం చెబుతున్నావు. నువ్వు మాకు పెళ్ళిఫోటోలు చూపించాలని వచ్చావు. అవునా?” అన్నాడు.

"మీరేమంటున్నారో నా కర్థం కావడంలేదు—" అన్నాడు విశ్వం.

"నేనేమన్నప్పటికీ అనూరాధ క్షేమం కాంక్షించే వాడ్ని. అది మామీద ద్వేషంతో వున్నా నాకు బాధ లేదు. ఎక్కడో అక్కడ క్షేమంగా వుంటే చాలు. అందుకని నువ్విలాంటి అబద్ధాలు చెప్పకు. అందువల్ల మా మనసు క్షోభపడడడం మినహాగా మరేమీ ప్రయోజన ముండదు" అన్నాడు సీతారామయ్య.

"అనూరాధ ఇక్కడికే వచ్చిందని నా నమ్మకం."

"వస్తే ఎక్కడుందంటావ్?"

"తను నాకు మనోరమ అనే పేరుగల చెల్లెలుందని నాకు చెప్పలేదు."

"పోనీ—తన చెల్లెలు పేరేమిటని చెప్పింది?"

"అసలు తనకు చెల్లెలున్నట్లే చెప్పలేదు."

"అయితే ఏమంటావ్?"

"మీరు మనోరమ అంటున్నమ్మాయి అచ్చం నాభార్య అనూరాధలాగే వుంది....అమే...."

సీతారామయ్య కళ్ళెర్రబడ్డాయి—"ఏం-కవల పిల్లలు గదా అని అక్కా-చెల్లెళ్ళిద్దరితోనూ కాపురం చేద్దామను కొంటున్నావా—ఇలాంటి వేషాలు నా దగ్గర కుదరవు.." అన్నాడు తీవ్రంగా.

సీతారామయ్య స్వరం మారగానే విశ్వం తడబడ్డాడు- "అబ్బే—నా ఉద్దేశ్యమదికాదు...." అన్నాడు.

"నీ ఉద్దేశ్యమేమైనా—నా రెండో కూతురి జోలికి రాకు. దానికి సంబంధంకూడా నిశ్చయమైంది. కుర్రాడు బుద్ధిమంతుడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. పెద్దమ్మాయి చేసిన పనికి—దీనికి పెళ్ళి సంబంధం కుదిర్చే

దెలాగా అని బెంగపెట్టుకున్నాను. కానీ అదృష్టవశాత్తూ ఇదెలాగో కుదిరింది. దయుంచి ఈ సంబంధం చెడగొట్టకు...." అన్నాడు సీతారామయ్య.

"అయితే అనూరాధ ఏమైందంటారు?" అన్నాడు విశ్వం.

సీతారామయ్య భ్రుకుటి ముడతలు పడింది—"కొంపదీసి అనూరాధను నువ్వు కానీ ఏమీ చేయలేదు కదా!" అన్నాడు.

"అంటే?"

"అనూరాధ యేమైందని అమాయకంగా నువ్వు నన్నడుగుతున్నావు. దాన్నేం చేశావని నేను నిలదీస్తున్నాను. జవాబు చెప్పు...."

విశ్వం తెల్లబోయి—"అనూరాధ పుట్టింటికనే బయల్దేరింది. నాకా విషయం ఖచ్చితంగా తెలుసు. మొత్తం వ్యవహారమంతా ఏదో తిరకాసుగా వుంది. అయితే నిజం నేను తెలుసుకోలేకపోను...." అన్నాడు.

"నిజమేదైనా ఒక వారం రోజుల్లో నేను మీ ఇంటికి వస్తాను. నా కూతురక్కడ కనపడకపోయిందా- నిజం తేల్చడానికి పోలీసులే రంగంలోకి దిగుతారు...."

పోలీసుల పేరు వినగానే విశ్వం తడబడ్డాడు.

3

సత్యనారాయణ విశ్వానికి నమస్కరించి-"మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది—" అన్నాడు.

"మనం కలుసుకుని మాట్లాడుకోవడం — ఇద్దరికీ అవసరం కూడా—" అన్నాడు విశ్వం.

"మీరేదో చెప్పాలని వచ్చినట్లున్నారు.." అన్నాడు

సత్యనారాయణ.

"అవును—ముందీ ఫోటోలు చూడండి...." విశ్వం జేబులోంచి ఓ కవరు తీసిచ్చాడు.

సత్యనారాయణ కవర్లోని ఫోటోలన్నీ చూసి—"ఇవి మీ పెళ్ళిఫోటోలనుకుంటాను...." అన్నాడు.

"అవును. మీ పెళ్ళి జరిగితే ఈ ఫోటోలకూ మీ పెళ్ళి ఫోటోలకూ ఒక్కటే తేడా వుంటుంది. నా స్థానంలో మీరుంటారు...."

"అంటే?"

"రెండో పెళ్ళి ఫోటోల్లోనూ పెళ్ళికూతురు మారదు."

సత్యనారాయణ నవ్వి—"అవును—వాళ్ళు కవలలు కదా!" అన్నాడు.

"మీ రెప్పుడైనా ఆ కవలలిద్దర్నీ కలిపి చూశారా?"

"ఎందుకని మీరిలా అడుగుతున్నారు....?"

"నా అనుమానం—...." అని ఏదో చెప్పబోయి ఆగిపోయాడు విశ్వం. వాక్యం పూర్తిచేయకపోయినా తన భావం అర్థం చేసుకుని వుండవచ్చునన్న భావంతో అతడు సత్యనారాయణ వంక చూశాడు.

"మీ అనుమాన మేమిటో నాకర్థం కాలేదు—" అన్నాడు సత్యనారాయణ.

"సీతారామయ్యగారికొకే అమ్మాయని...."

"అంటే?"

"అనూరాధ, మనోరమ—ఇద్దరూ ఒక రేనని...."

"అలా ఎందుకు తలిదండ్రులు అబద్ధం చెబుతారు?"

మళ్ళీ యేదో చెప్పబోయి ఆగిపోయాడు విశ్వం—"అబద్ధాలు చెప్పడానికెవరి కారణాలు వాళ్ళకుంటాయి. అవన్నీ మీకు తర్వాత వివరిస్తాను. ముందు నా ప్రశ్నకు

జవాబు చెప్పండి. మీ రెప్పుడైనా ఇద్దర్నీ కలిసి చూశారా?"

"లేదు—" అన్నాడు సత్యనారాయణ.

"అసలు తమకిద్దరు కవల పిల్లలున్నారని సీతా రామయ్యగారు మీ కెప్పుడు చెప్పారు?" అన్నాడు విశ్వం.

"రెండురోజుల క్రితం."

"ఎందుకు చెప్పారు?"

సత్యనారాయణ గుర్తుచేసుకుందుకు ప్రయత్నిస్తున్న వాడిలా కళ్ళు మూసుకున్నాడు.

"రెండేళ్ళ క్రితం ఉద్యోగరీత్యా నేనీ వూరొచ్చాను. అద్దె ఇల్లుకోసం వెతుకుతూ నేను వాళ్ళింటికి వెళ్ళాను. ఇంట్లో మనోరమ వుంది. అద్దె యిల్లు దొరకలేదు కానీ— నేనామెను ప్రేమించాను. వీలున్నప్పుడల్లా ఆమెను బయట కలుసుకుని పరిచయం పెంచుకుందుకు ప్రయత్నించాను. ఆమె నేనంటే ఎక్కువ ఇష్టపడలేదు. అలా ఆర్నెల్లు జరిగాక ఆమె ఊళ్ళో లేదు. వాకబు చేయగా యెక్కడో బంధువులింటికి వెళ్ళిందని తెలిసింది. ఆ తర్వాత మధ్య మధ్య యెప్పుడైనా కనిపిస్తూండేది. అంటే ఊర్నించి వచ్చినప్పుడు., నేనోసారి సీతారామయ్య గారిని కలుసుకుని నా అభిప్రాయంకూడా చెప్పాను. ఆయనంతా విని—అంతా అమ్మాయిష్టం—అన్నారు. మనోరమ ఇష్టపడితే తనే స్వయంగా నా యింటికి వస్తానన్నారు. రెండ్రోజుల క్రితమే మా ఇంటికాయన వచ్చి విషయాలు చాలా చెప్పారు. పెద్దమ్మాయి ప్రేమ వివాహం చేసుకుని తమతో తెగతెంపులు చేసుకుందని చెప్పి ఓ కార్డుకూడా చూపించారు. పెళ్ళి విషయం

ఆడపిల్లలకు వదలడం చాలా తెలివితక్కువ పని అనీ— అలాంటి పొరపాటు మళ్ళీ చేయననీ అన్నారు. ఆయన మనోరమకూ నాకూ పెళ్ళి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. మనోరమ చేస్తున్న ఉద్యోగం మానిపించి ఇంటికి రప్పించామని చెప్పారు. ఇదీ నా కథ...." అన్నాడు సత్యనారాయణ.

"మీ కథ నా అనుమానాన్ని పెంచుతోంది. ఇందులో ఏదో తిరకాసుంది. మనోరమ పేరు—మీకు మొదటిసారి తెలిసినప్పట్నించీ అదేనా?" అన్నాడు విశ్వం.

"ఆమె పేరు నాకు తెలిసినప్పట్నించీ అదే....—"

విశ్వం నిట్టూర్చి—"ఏమిటో-అంతా అయోమయంగా వుంది. మీరు పెళ్ళి చేసుకోబోతున్న మనోరమ నాతో కాపురంచేసిన అనూరాధేనని నా అనుమానం. మీరు సహకరిస్తే ఈ విషయం తేల్చేయొచ్చు. అది మీకూ మంచిది...." అన్నాడు.

"ఎలా తేల్చడమో మీరే చెప్పండి. నాకు వీలుంటే సహకరిస్తాను...."

"ఆమె శరీరంమీద కొన్ని గుర్తులు చెప్పగలను...." అంటూ విశ్వం అతడికి మొత్తం నాలుగు గుర్తులు చెప్పాడు.

అది వింటూనే సత్యనారాయణ చెవులు మూసుకుని- "పరాయి ఆడపిల్ల దగ్గర—ఇలాంటి గుర్తులు నేనెలా కనుక్కోగలను?" అన్నాడు.

"మనోరమ మీకు పరాయిదికాదు. కాబోయే భార్య!"

సత్యనారాయణ క్షణం ఆలోచించి — "మీరు చెప్పిందీ రైటే! అయితే ఈ విషయంలో నేను మీకు తప్పక సహకరించగలను...." అన్నాడు.

"థాంక్స్—మనం మళ్ళీ యెప్పుడు కలుసుకుందాం?"

"ఏమో-పెళ్ళికి ముహూర్తాలెప్పుడున్నాయో నాకెలా తెలుసుంది?"

"పెళ్ళి ముహూర్తా లేమిటి?"

"నాకూ మనోరమకూ పెళ్ళయ్యాకనే కదా—మీకీ విషయం చెప్పగల్గుతాను...."

విశ్వం విసుగ్గా—"పెళ్ళయ్యాక—ఆమె మనోరమ కాదు—అనూరాధ—అని తెలుసుకుని ఏం చేస్తారు?" అన్నాడు.

"ఏం చేయాలో నాకూ తెలియదు. అసలు తెలుసుకోవాలన్న కుతూహలం కూడా నాకు లేదు. కానీ మీరడిగారు కదా...."

విశ్వం ముఖంలో అసహనం కనబడింది — "అంటే ఆమె అనూరాధ అనీ — నాతో కాపురం చేసిందనీ తెలిసినాకూడా మీరామెతో కాపురం చేయగలరన్న మాట!"

"మీరు చెప్పిన గుర్తులామె కంటిమీదున్నంత మాత్రాన—ఆమె అనూరాధ అయిపోదుగదా! నాతో కలిసి జీవించాలని వచ్చిన ఆమె మాటలే నేను నమ్ముతాను. నాకు ప్రయోజనం లేనప్పుడు—నిజాల గురించి కూడా పట్టించుకోను...." అన్నాడు సత్యనారాయణ.

"అలా పట్టించుకోకపోవడంవల్ల—మీక్కూడా నాగతే పట్టవచ్చు...."

"మిస్టర్ విశ్వం! నా భార్య అలా చేస్తే ఆ తప్పు నాదే అవుతుంది. ఎందుకంటే—హిందూ స్త్రీ తనంతటత నే తన కాపురంలో నిప్పులు పోసుకోవాలనుకోదు. ఆమె అలా చేసిందంటే అందులో భర్త బాధ్యత చాలా

వుంటుంది....” అన్నాడు సత్యనారాయణ.

విశ్వం చటుక్కున లేచి నిలబడి—“మీకు సాయ పడాలనుకోవడం నా తెలివితక్కువ. అయితే మీ పెళ్ళి ముహూర్తం వచ్చేలోగా అనూరాధను బయటకు లాగ లేనంతటి తెలివితక్కువవాణ్ని మాత్రం కాను....” అన్నాడు.

4

అది సుందరేశన్ కంపెనీ. బిజినెస్ కన్సల్టెన్సీ వాళ్ళు చేస్తున్న వ్యాపారం. ఏయే ప్రాంతాల ఏయే వస్తువులకు గిరాకీ ఉన్నదీ—ఒకే వస్తువుకు వివిధ కంపెనీలు నిర్ణ యించిన వివిధ ధరలు-షేర్ మార్కెట్ తీరుతెన్నులు-ఇలా ఒకటేమిటి-వ్యాపారానికి సంబంధించిన యెన్నో వ్యవహారాల్లో అక్కడ సమాచారం, సలహా, సంప్ర దింపులు లభిస్తూంటాయి.

అక్కడి ఆఫీసులో మొత్తం ఎలభై మంది ఉద్యోగు లున్నారు. నాలుగు సెక్షన్లున్నాయి.

విశ్వం ఆ ఆఫీసులో అడుగుపెట్టి రిసెప్షనిస్టును కలుసు కున్నాడు. ఆమె ఇరవై ఏళ్ళ అందమైన యువతి. మామూలుగానే నవ్వుతున్నట్టుందే ముఖం. చిరునవ్వు నవ్వినప్పుడు చూడగానే—ఆ చిరునవ్వుకోసం మళ్ళీ మళ్ళీ ఆ ఆఫీసుకు రావాలనిపిస్తుంది.

“వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ-....” అందామె.

“ఇక్కడ పనిచేస్తున్న అనూరాధ అనే అమ్మాయి గురించి తెలుసుకుందుకు వచ్చాను....” అన్నాడు విశ్వం.

“మీరు లోపలకు వెళ్ళి శ్రీమన్నారాయణగారిని కలుసుకోండి....” అందా అమ్మాయి వెంటనే.

విశ్వం లోపలకు వెళ్ళాడు. శ్రీమన్నారాయణ

గురించి తనకు కనబడిన ప్యూన్‌ని అడిగాడు.

శ్రీమన్నారాయణ ఓ సెక్షన్‌కి హెడ్. ప్యూన్ విశ్వాన్ని శ్రీమన్నారాయణ దగ్గరకు తీసుకొని వెళ్లాడు.

శ్రీమన్నారాయణ ఫుల్ సూటులో వున్నాడు. గది పూర్తిగా ఎయిర్ కండిషన్డు. విశ్వం అక్కడి యేర్పాట్లు చూసి—"అనూరాధ గొప్ప కంపెనీలోనే పని చేసే దన్నమాట...." అనుకున్నాడు.

అంతకుముందు అతడెన్నడూ ఆ కంపెనీ ఆఫీసులో అడుగుపెట్టలేదు. అనూరాధ అందుకతడిని ప్రోత్సహించనూ లేదు.

"మీ కంపెనీలో పనిచేసే మిస్ అనూరాధ గురించి తెలుసుకోవాలని వచ్చాను..." అన్నాడు విశ్వం.

"ఏం తెలుసుకోవాలి?"

"ఆమె విద్యాభ్యాసం యెక్కడ జరిగిందోనని.... మీ దగ్గర సర్టిఫికెట్స్ వుంటాయి కదా...."

"మీరు పోలీసులా?" అన్నాడు శ్రీమన్నారాయణ.

"అలాగే అనుకోవచ్చు...."

"మీకు సహకరించాల్సిన బాధ్యత నాకుంది—కానీ మీకా ట్టే సహకరించలేనని నా భయం...." అన్నాడు శ్రీమన్నారాయణ.

అనూరాధ సుమారు ఏణర్ధం అక్కడ పనిచేసింది. పదిరోజుల క్రితమే ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇకపోతే ఆమె అక్కడ చేసే ఉద్యోగానికి యే సర్టిఫికెట్లూ అవసరం లేదు.

"ఎందుకంటే ఒకోసారి యే సర్టిఫికెట్సూ లేనివారు ఉన్న వారికంటే బాగా పని చేయగల్గుతారు. సర్టిఫికెట్సుకు ప్రాముఖ్యతనిస్తే—అలాంటి వారిని సెలక్ట్

చేయడానికిబ్బంది. అందుకని మేము ఇక్కడకు వచ్చిన వారిని పరీక్షిస్తాము. పనికొస్తారనుకున్న వారికి మేమే శిక్షణకూడా యిచ్చుకుంటాము....” అన్నాడు శ్రీమన్నారాయణ.

“అంటే మీవద్ద అనూరాధ అనే పేరుతో పని చేస్తున్న అమ్మాయి పేరు మనోరమ అయ్యే అవకాశం కూడా వుందన్నమాటే!” అన్నాడు విశ్వం.

శ్రీమన్నారాయణ కర్థంకాలేదు. విశ్వం వివరించాడు- “సర్టిఫికెట్లడగరు మీరు. అంటే ఆమె తనే పేరు చెబితే అదే నమ్ముతారు. సర్టిఫికెట్లలో తన పేరు మనోరమ అనే వున్నా—ఆమె మీకు అనూరాధ అని తన పేరు చెబితే మీరదే ఆమె పేరనుకుంటాను....”

“కావచ్చు....”

అనూరాధ గురించి ఇంకేమైనా చెప్పగలరా?”

“చాలా మంచి వర్కర్. వెరీ సిన్సియర్. మా కంపెనీకి ఆమె లేకపోవడం ఒక తీరని నష్టం....” అన్నాడు శ్రీమన్నారాయణ.

“అనూరాధ గురించి ఆఫీసులో ఇంకా చెప్పగల వారెవరైనా ఉంటారా?”

శ్రీమన్నారాయణ మందహాసం చేసి—“మేము చేస్తున్నది వ్యాపారం. ఇది గవర్నమెంటాఫీసు కాదు. అందుకే ఇక్కడ నియమమేమిటంటే—ఈ కంపెనీలో పనిచేస్తున్న వారంతా యెవరికివారే యమునాతీరే అన్నట్లుండాలి. ఒకరితో ఒకరు మాట్లాడకూడదు. ఆఫీసు బయటకూడా ఎవరూ ఎవరితోనూ స్నేహ సంబంధాలు పెంచుకోకూడదు. అటువంటిదేమైనా మా దృష్టికివస్తే- ఆ ఉద్యోగులు హెచ్చరింపబడతారు. అందువల్ల అనూ

రాధతో ఇక్కడింకెవరికైనా పరిచయమున్నప్పటికీ— వారా విషయం మాకు చెప్పరు. మేమే కూపీలాగ దాని కెవరినో నియమించామనుకుని భయపడతారు” అన్నాడు.

“చాలా తమాషాగా వుంది....” అన్నాడు విశ్వం.

“వ్యక్తిగత జీవితానికీ ఆఫీసుకూ యేమీ సంబంధ ముండకూడదు. అంటే ఇళ్ళల్లో యేదైనా శుభం జరిగితే స్వీట్సు పంచిపెట్టడంకూడా మేము ప్రోత్సహించము.”

“ఇలాగైతే ఇక్కడెవరూ యెక్కువకాలం పని చేయరు....”

శ్రీమన్నారాయణ నవ్వి — “మేమిచ్చే జీతాలు ఎక్కువ. అందుకని ఎవరూ ఇక్కణ్ణించి వెళ్ళిపోవాలను కోరు. అయినా ఆఫీసుకు వచ్చేది నియమిత కాలంలో అప్పగించబడిన పనిచేయడానికి తప్పితే ఊసుపోక కబుర్లకూ వాటికీ కాదు కదా! మా ఆఫీసులో యెవ రెప్పుడు ఉద్యోగం మానేసినా బాధలేదు. మా దగ్గర అన్ని రకాల ఉద్యోగాలకీ — వెయిటింగు లిస్టులో రకానికో వందమంది చొప్పున వున్నారు....” అన్నాడు.

విశ్వం లేచి—“థాంక్స్!” అన్నాడు.

5

విశ్వం దిగులుగా ఇంట్లో కూర్చున్నాడు. తల్లి నర్సమ్మ అక్కడకొచ్చి—“ఏరా—కోడలుపిల్ల కబురు తెలిసే అవకాశం లేదా?” అంది.

“నీ కోడలుపిల్ల మళ్ళీ పెళ్ళి చేసుకుంటోంది....” అన్నాడు విశ్వం.

“అది చేసుకుంటానంటే మాత్రం చేసుకుందుకెవరైనా సిద్ధంగా వుండాలి కదా!”

“ఉన్నాడమ్మా—ఇప్పుడు దాని పేరు అనూరాధ

కాదు—మనోరమ!"

"ఏమిటీ—అది పేర్లు కూడా మారుస్తోందా—అమాయకంగా కనపడేది—దానికన్ని తెలివితేటలొచ్చాయా?" అంది నర్సమ్మ.

"ఇప్పుడూ అమాయకంగానే కనబడుతోందమ్మా.." అన్నాడు విశ్వం. అతడు తల్లికి నెమ్మదిగా అంతకు రెండు రోజులముందు సీతారామయ్య ఇంట్లో తనకు జరిగిన అనుభవమూ, సత్యనారాయణ గురించీ చెప్పాడు.

నర్సమ్మ ముక్కుమీద వేలేసుకుని—"ఇక్కడ నిన్ను పెళ్ళి చేసుకుని మళ్ళీ అక్కడింకో పెళ్ళికి తయారవుతోందా—చాలా విడ్డూరంగా ఉందే!" అంది.

"ఇప్పుడు నేనేం చేయాలో చెప్పమ్మా!" అన్నాడు విశ్వం దీనంగా.

"నువ్వు చవట దద్దమ్మలా ఊరుకున్నా నేనూరుకోను. ఇప్పుడే ప్రయాణమై వెళ్ళి—ఇంటిల్లపాదినీ నిలదీసి జుట్టుపట్టి మరీ దాన్ని కాపురానికి తీసుకొస్తాను—" అంది నర్సమ్మ కోపంగా.

"మనం వాళ్ళనేం నిలదీస్తామమ్మా—వాళ్ళే మనల్ని నిలదీసేలాగున్నారు. పదిరోజుల్లో మనం అనూరాధ ఆచూకీ చెప్పకపోతే వాళ్ళు పోలీసుకంప్లయింట్ కూడా యిస్తామని బెదిరించారు...."

పోలీస్ కంప్లయింట్ పేరు వినగానే నర్సమ్మ కూడా కంగారు పడింది.

"అయితే దాని ఆఫీసుకు వెళ్ళి కనుక్కోలేకపోయావా" ఈ పేర్ల తిరకాసేమిటో తెలిసేది...." అంది నర్సమ్మ.

"నీకు చెప్పకుండా ఈ రెండ్రోజులూ నేను చేసిం

దదే! ఏమీ ప్రయోజనం లేదు. అది మనకంటే తెలి వైనది. దెబ్బతినేశాం...." అన్నాడు విశ్వం.

"అయితే రంగా యేమంటాడో ఇప్పుడు...." అంది నర్సమ్మ సాలోచనగా.

"ఏమన్నప్పటికీ రంగాను పిలిచి మాట్లాడ్డం మంచి దేమో...." అన్నాడు విశ్వం.

"మనని బాగా తిడతాడు-" అంది నర్సమ్మ.

"తిట్టినా తప్పదు..." అన్నాడు విశ్వం.

6

పడక కుర్చీలో వెనక్కు వాలి పడుకుని కళ్ళు రెండూ మూసుకుని-"అంటే-నీ పెళ్లాం పారిపోయిందన్నమాట" అన్నాడు రంగా.

"ఊఁ" అన్నాడు విశ్వం.

"పట్టుమని పదిరోజులైనా కాపురం చేయలేదు-" అంది నర్సమ్మ.

"ఎందుకు పారిపోయింది?" అన్నాడు రంగా.

"తెలియదు..."

"చూడు విశ్వం. ఆపిల్ల నిన్ను ప్రేమించింది. తల్లి దండ్రులెన్నెదిరించి మరీ నిన్ను పెళ్ళి చేసుకుంది. నువ్వే ప్రపంచమనుకుని నీతోనే వుండిపోవాలనుకుంది. అలాంటి పిల్ల ఉన్నట్లుండి ఎందుకు పారిపోతుంది?" అన్నాడు రంగా.

"అదే నాకూ అర్థం కావడంలేదు. అసలు తనిలా పారిపోవచ్చు ననిపించేలా కూడా నా వద్ద ప్రవర్తించ లేదు. పైగా తను పేరు మార్చుకుంది...తన పేరిప్పుడు మనోరమ అంటోంది..."

"నా అభిప్రాయంలో అనూరాధ పేరు, మనోరమ

వేరు. ఎందుకంటే హిందూ స్త్రీ—భర్తనంత సులభంగా విడిచిపెట్టదు. విడిచిపెట్టిన హిందూ స్త్రీకి అంత సులభంగా వివాహం కాదు. ఈ రెండూ జరుగుతున్నాయంటే ఆమె తప్పకుండా వేరే యువతి అయుండాలని నేను నమ్ముతున్నాను...."

"అయితే అనూరాధ ఏమయుంటుంది?"

"అదే నేను నిన్నడగుతున్నాను...."

"అంటే?" కంగారుగా అన్నాడు విశ్వం.

"నీకు నీ భార్యంటే ప్రేమ ఏర్పడింది. ఆమెనెక్కడో దాచావు...."

"దాచడమెందుకు?"

"ఎందుకో నువ్వే ఆలోచించు..." అన్నాడు రంగా.

విశ్వం కాసేపు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా "రంగా—నువ్వు నన్ను నమ్ము. నా భార్యను వెతికే మార్గం చెప్పు...." అన్నాడు.

"మెలకువగా వున్న వాళ్ళను నిద్ర లేపడమెంత కష్టమో — తప్పిపోయిన వాళ్ళను వెతకడమూ అంత కష్టం. నువ్వు నన్ను మోసం చేస్తున్నావు. అసలేం జరిగిందో చెప్పు...."

"నేను నీకు నిజమే చెప్పాను...."

"అయితే నేను చెప్పినట్లు చేస్తావా?"

"చేస్తాను...."

"మాట తప్పకూడదు...."

"తప్పను...."

"ఇంతకీ మావాడినేం చేయమంటావ్ బాబూ!" అంది నర్సమ్మ.

"మళ్ళీ పెళ్ళి చేసుకోమంటాను...."

"మళ్ళీ పెళ్ళా?" విశ్వం గుటకలు మింగాడు.

"ఏం- సంతోషించడానికి బదులు భయపడతావేం?"

"రెండోసారి పెళ్ళిచేసుకోవడం నేరం కదూ!"

"నీకు మొదటిసారి పెళ్ళి జరిగితే కదా—రెండో పెళ్ళి చేసుకునేందుకు...." అన్నాడు రంగా.

"అంటే?"

"ముందు మీరిక్కడ్నించి మకాం మార్చేస్తారు. నీకు పెళ్ళైనట్లు సాక్ష్యాలేమున్నాయి...."

"పెళ్ళి ఫోటోలు...."

"అవి మన దగ్గరే వున్నాయి కదురా—" అంది నర్సమ్మ.

"అవును—ఆ తర్వాతింట్లో అడిగితే-నెగెటివ్సున్నాయి-ప్రింటు చేయించి పంపిస్తానని చెప్పాను తప్పితే వాళ్ళ కివ్వలేదు—" అన్నాడు విశ్వం.

"అయితే చాలా మంచి పని చేశావు. ఆ ఫోటోలూ నెగెటివ్సూ ఇలా తీసుకురా. ఇప్పుడే ఇక్కడే తగలెట్టేద్దాం...." అన్నాడు రంగా.

"అవి మన దగ్గరే ఉంటే నష్టమేమిటి?" అన్నాడు విశ్వం.

"భలేవాడివే.... రేపే కారణం చేతయినా పోలీసులీ యిల్లు సెర్చిచేస్తే—ఆ ఫోటోలు దొరక్కూడదు. అసలు-అనూరాధనే పేరుగల యువతి ఈ యింట్లో యెన్నడూ అడుగుపెట్టలేదు. నీ పెళ్ళి రహస్యంగా జరిగింది. ఆ పెళ్ళికి సాక్షిని నేనే! అనూరాధనీ యింట్లో కొద్ది రోజు లెవరైనా చూసి వుండవచ్చు. కానీ ఆమె నీ భార్యగా ఇక్కడెవ్వరికీ పరిచయం చేయబడలేదు. ఎవరో అమ్మాయి చుట్టపు చూపుగా వచ్చి ఉందని అంతా అనుకుని

ఉంటారు. అదీకాక మీరెక్కణ్నించి మకా మెలాగూ మార్చేస్తున్నారు....”

విశ్వం లోపలకు వెళ్ళి తిరిగివచ్చాడు. అతడి చేతుల్లో ఓ కవరుంది—....“ఇవీ ఫోటోలు....”

రంగా అందుకుని—ఫోటోలను చూసి — “గుడ్!” అన్నాడు. అతడు కుడిచేత్తో వాటిని పట్టుకొని ఎడంచేత్తో సిగరెట్ లైటర్ వెలిగించి—ఆ ఫోటోలను అంటించాడు. గుప్పున మండాయవి. వాటిని నేలమీదకు జారవిడుస్తూ—“నెగెటివ్స్ కూడా యివ్వు!” అన్నాడు.

విశ్వం తల వంచుకుని-“నెగెటివ్స్ కనిపించడంలేదు” అన్నాడు.

“వాట్!” అన్నాడు రంగా.

“నేను ఫోటోల నొకచోటా నెగెటివ్స్ నొకచోటా భద్రంగా దాచాను. ఇప్పుడు నెగెటివ్స్ కనిపించడం లేదు....”

“నువ్వు నిజమే చెబుతున్నావా?”

“ఊఁ.”

“నెగెటివ్స్ ఎప్పట్నించి కనబడ్డం లేదు....?” అన్నాడు రంగా.

“నెగెటివ్స్ వేరే పెట్టానని చెప్పానుకదా—ఫోటోలు వచ్చేక ఫోటోలనే. మళ్ళీ వాటికోసం చూడలేదు. ఇదే చూడ్డం....”

“అంటే ఒకవేళ నీ భార్య తను వెళ్ళిపోతూ వాటిని తీసుకునిపోయే అవకాశముందా?” అన్నాడు రంగా.

విశ్వం ఉలిక్కిపడి—“ఇది నాకు తట్టనేలేదు. అలాగే జరిగుండవచ్చు—” అన్నాడు.

“అలాగే ఎందుకు జరుగుతుంది?” అన్నాడు రంగా.

విశ్వం మాట్లాడలేదు.

"విశ్వం—నువ్వు నన్ను మోసమైనా చేస్తూండాలి. లేదా నీవల్ల పెద్ద పొరపాటైనా జరిగుండాలి. నీ భార్య ఇక్కణ్నించి వెళ్ళిపోతూ కూడా నాగటివ్స్ తీసుకుని వెళ్ళాలని ఎందుకనుకుంది? అసలు తనిక్కణ్నించి వెళ్లి పోవాలన్న ఆలోచనకెందుకొచ్చింది?"

"నువ్వు నన్నీ ప్రశ్న లెందు కడుగుతున్నావు?"

"నీ భార్యకు నీ గురించి తెలిసిపోయిందా?"

"ఆ అవకాశం లేదు. అబ్బాయి తన జాగ్రత్తలో తనున్నాడు—" అంది నర్సమ్మ తను కొడుకు తరఫున మాట్లాడుతూ.

"అబ్బాయి తన జాగ్రత్తలో తనుండడం సహజం. ఎందుకంటే రహస్యం అబ్బాయికి తెలుసు కాబట్టి. కానీ అమ్మాయికూడా తన జాగ్రత్తలో తనుందని నాకిప్పుడని పిస్తోంది. అలా ఎందుకు జరిగిందీ అని ఆలోచిస్తున్నాను."

విశ్వం చటుక్కున—"రంగా—నువ్వు చెప్పింది నిజం. ఆమె తన జాగ్రత్తలో తనుందని నాకిప్పుడర్థమవుతోంది" అన్నాడు.

"అంటే?"

"మాకిద్దరికీ వివాహమైనా మేము భార్యాభర్తల్లా కలిసి జీవించలేదు. తనకు ఆరోగ్యం సరిగా లేదని చెప్పింది. డాక్టరు వద్దకుకూడా తీసుకొని వెళ్ళాను. ఆమె అనూరాధను పరీక్షించి నెలరోజులపాటు సంసార జీవితానికి దూరంగా వుండాలని చెప్పింది...."

రంగా తెల్లబోయి—"విశ్వం—నువ్వు తెలివితక్కువ వాడివని తెలుసు. కానీ మరీ యింత ఫూల్‌వనుకోలేదు-" అన్నాడు.

"నా పరిస్థితుల్లో యెవరైనా అలాగే అనుకుంటారు. ఆమె యెంతో అమాయకంగా మాట్లాడింది. నావంక జాలిగా చూసేది. నామీద జాలిపడేది...." విశ్వం స్వరం తగ్గించి—"రంగా — ఇంతకంటే ఏం చెప్పను? ఆమె నామీద జాలితో నన్ను తన నగ్న శరీరాన్ని రెండుమూడుసార్లు చూడనిచ్చింది-" అని రంగాకు మాత్రమే వినపడేలా చెప్పాడు.

"అనూరాధను పరీక్షించిన ఆ లేడీ డాక్టరు ఎవరు?"

"డాక్టర్ ప్రభాదేవి."

"ఆమె బాగా పేరున్న డాక్టరు...." అన్నాడు రంగా-"అంటే నీ భార్య చాలా చాలా తెలివైనదయుండాలి. అంత అందమైన ఆడదానికన్ని తెలివితేటలున్నాయంటే నమ్మశక్యం కాకుండా వుంది."

"ఇప్పుడేం చేయాలి?"

"నీ భార్యకన్ని తెలివితేటలుండడానికి వీల్లేదు. ఎవరో తెలివైన వాళ్లామెకు సాయపడ్డారు. యెవరు వాళ్ళు?"

"రంగా-నువ్వు చెప్పేవన్నీ వింటూంటే నాకు భయం వేస్తోంది...." అన్నాడు విశ్వం.

రంగా అతడి వంక అనుమానంగా చూస్తూ-"తప్పు చేసినవారే భయపడతారు.." అన్నాడు.

"అంటే?"

"నీ భార్యకు సాయపడగల తెలివైన వాడివి నువ్వేనని నా అనుమానం.." అన్నాడు రంగా.

"ఇది చాలా అన్యాయం. నేను తెలివితక్కువవాడినని ఇందాకా నువ్వే అన్నావు!"

"తెలివితక్కువ వాడినని భ్రమింపజేయడం కూడా

ఒకవిధమైన తెలివే!" అన్నాడు రంగా.

"ప్లీజ్ రంగా! నన్ను నమ్ము. నువ్వేం చెబితే అది చేస్తాను."

రంగా సాలోచనగా-"వ్యవహారం చాలా తిరకాసుగా వుంది. మనం వేయబోయే ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. ఏది యేమైనా నువ్వు పెళ్ళికి సిద్ధపడాలి..." అన్నాడు.

"నువ్వేం చెబితే దానికి నేను సిద్ధం. కానీ ఇందులో యెలాంటి ప్రమాదమెదురైనా నువ్వే నన్ను రక్షించాలి" అన్నాడు విశ్వం.

"నన్ను నమ్మిన వాళ్ళను నేను రక్షించగలను.." అన్నాడు రంగా. తర్వాత అతడు విశ్వానికి పరిస్థితి వివరించి చెప్పాడు.

అనూరాధకు విశ్వం గురించిన రహస్యం విశ్వంద్వారా తెలియడానికి లేదు. ఆ రహస్యమామెకు ఎలాగో తెలిసి తెలివిగా అతడినుంచి తప్పించుకుంది. అసలు పెళ్ళిచేసుకోకముందే ఆమెకీ విషయం తెలిసుండాలి. జరుగనున్న పెళ్లిని ఓ నాటకంలా భావించి ఆమె అందుకు సిద్ధపడింది. తర్వాత ఒకరోజున పుట్టింటి వంకపెట్టి పారిపోయింది. ఆమె యెందుకలా చేసిందో ప్రస్తుతానికి తెగే విషయం కాదు. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఆమె చాలా తెలివైనది. తనను మోసంచేయాలనుకుంటున్న వ్యక్తిని, తెలిసికూడా పెళ్లిచేసుకుంది. పెళ్ళయ్యాకకూడా అతడి మోసం తనకెక్కడా తెలియదన్న భ్రమ నతడికి కలిగించింది. పెళ్ళి ఫోటోల నెగటివ్సుతోసహా పారిపోయింది.

ఇప్పుడామె ఏదైనా సాధించాలనుకుంటోందా?

"అనూరాధ తన్ను తాను రక్షించుకునేందుకిలా చేసి వుంటే ఆమెతో మనకి సంబంధంలేదు. అలాకాక మన కోలికి వచ్చిందా.." అని రంగా ఒక్క క్షణం ఆగి- "నే నేమంటానో అని కుతూహలపడుతున్నావు కదూ! అదిప్పుడు చెప్పను-" అన్నాడు.

7

విశ్వం, నర్సమ్మ బస్సు దిగారు. బస్ స్టాండులో రిక్షా వాళ్ళు వాళ్ల చుట్టూ మూగారు. విశ్వం తామెక్కడికి వెళ్లాలో చెప్పాడు. నర్సమ్మ రిక్షా బేరమాడింది.

ఇద్దరూ రిక్షా ఎక్కారు. రిక్షా శర వేగంతో దూసుకుని పోయి ఓ ఇంటిముందాగింది.

అక్కడ ఇంట్లో చాలా హడావుడిగా వుంది. ఎవరో ఓ చిన్న కుర్రాడొచ్చి — "పెళ్లి వారొచ్చేశారు—..." అన్నాడు. అప్పుడో ముసలాయన బయటకు వచ్చి- విశ్వాన్ని చూసి-"రా-నాయనా!" అన్నాడు. నర్సమ్మకు చేతులు జోడించి నమస్కరించాడు.

తల్లీ కొడుకు లిద్దరూ లోపలకు వెళ్లి ఆడపెళ్లి వారు చూపించిన కుర్చీల్లో కూర్చున్నారు. అక్కడ పరస్పర పరిచయాలయ్యాయి.

వియ్యపురాలు నర్సమ్మ దగ్గరకొచ్చి - "మాలతి నా సవతి కూతురని అంతా అంటారు. కానీ నాకలా అని పించదు. కన్నబిడ్డలకంటే ప్రేమగా పెంచాను దాన్ని" అంది.

నర్సమ్మ చిరునవ్వు నవ్వి - "ఈ లోకప్రతీరే అంత! మంచితనానికి పెడార్థాలు తీస్తుంది. మా అబ్బాయికి కట్నం, లాంఛనాలు అంటే అసహ్యం. ఆర్భాటాలంటే అసహ్యం. కానీ ఖర్చులేకుండా దండలు మార్చుకుంటే

అది పెళ్ళి కాదా అంటాడు. దీనికందరూ పెద్దరాలుతీసి వాడికి పెళ్ళే కాదని భయమేమో అంటారు..." అంది.

ఫలహారాలు వచ్చాయి. విశ్వం, నర్సమ్మ ఫలహారాలు తీసుకున్నారు, విశ్వం దృష్టంతా పెళ్లికూతురుమీదే వుంది. ఆమె చాలా అందగత్తె అని విన్నాడతను. ఇప్పుడు చూడబోతున్నాడు.

ఇంకా పెళ్ళికూతురు రాలేదు.

"తొందరగా అమ్మాయిని తీసుకొని రండమ్మా!" అంది నర్సమ్మ.

"ఈలోగా మీతో ఓ విషయం మాట్లాడాలి వదిన గారూ!" అంది వియ్యపురాలు. ఆమె పైకి లేవగా నర్సమ్మ ఆమెతో కలిసి లోపలకు వెళ్ళింది.

వియ్యపురాలు గది తలుపులు వేసింది. తన బొడ్లోంచి తాళంచెవులు తీసి — అక్కడున్న బీరువా తలుపులు తెరుస్తూ— "ఈ యింట్లో నేను తప్ప ఎవ్వరూ ఈ బీరువాను తాకడానికికూడా వీల్లేదు...." అంది.

ఆమె చెప్పదల్చుకున్నదేమిటా అని నర్సమ్మ ఎదురు చూస్తోంది.

వియ్యపురాలు బీరువా అరలోంచి ఓ మూలగా పెట్టిన కవరొకటి తీసింది. ఆ కవర్లోంచి ఓ కాగితంతీసి నర్సమ్మ కిచ్చి — "ఇది చదవండొదినగారూ...." అంది.

నర్సమ్మ ఆ కాగితం చదివింది. అందులో విశ్వానికి అంతకుముందే వివాహమైందన్న విషయం వ్రాసి వుంది.

"అబద్ధం!" అంది నర్సమ్మ అప్రయత్నంగా.

అప్పుడు వియ్యపురాలు కవర్లోంచి ఓ ఫోటోకూడా తీసి నర్సమ్మకిచ్చింది. అది చూస్తూనే నర్సమ్మ గుడ్లు తేలేసింది. ఏం మాట్లాడాలో ఆమెకర్థంకాలేదు.

"ఇదంతా యేమిటి వదినగారూ...." అంది వియ్యపు రాలు.

"ఏమో—నాకేమీ అర్థం కావడంలేదు...." అంది నర్సమ్మ.

"ఈ రోజుల్లో చాలామంది ఫోటోగ్రఫీలో ట్రిక్స్ చేస్తున్నారు. నా కూతురికి పెళ్ళి కుదిరిందని అసూయపడి కొంద రీ పెళ్ళి చెడగొట్టడానికి కుతంత్రం చేస్తున్నారు. అవునా?"

"అవును...." అనేసింది నర్సమ్మ వెంట నే.

"నేనలాగే అనుకున్నాను. అయినా సవతి తల్లి నికదా నేను చెబితే ఈ మాటెవరూ నమ్మరు. అందుకే మిమ్మ ల్నడిగి తెలుసుకుంటున్నాను...." అంది వియ్యపురాలు.

"మీరు చాలా మంచివారు...."

"అలాగనకండి. మీది చాలా మంచి సంబంధం. మీలాంటి అత్తగారినీ, మీ అబ్బాయిలాంటి భర్తనూ పొందాలంటే మా అమ్మాయి గత జన్మలో ఏ బంగార పువ్వులతో నే పూజచేసుకొని వుంటుంది. మీనుంచి నిజం తెలుసుకున్నాక నాకిప్పుడెంతో సంతోషంగా వుంది. ఇక మా మాలతికేలోటూ వుండదు...."

నర్సమ్మ అనుమానంగా—"మీరు నమ్మినా మిగతా వాళ్ళది నమ్ముతారా?" అంది.

"అదే మాలతి అదృష్టం. ఈ ఉత్తరం పోస్టుమన్ స్వయంగా నాకే యిచ్చాడు. నేనుకాక వేరెవరైనా ఇది చూసివుంటే ఈ పెళ్ళికి ఒప్పుకునేవారు కాదు. నాకున్న నిదానం మా ఇంట్లో ఇంకెవ్వరికీ లేదు...." అంది వియ్యపురాలు.

"మీవంటి వారితో వియ్యమందుతున్నామంటే మాదీ

అదృష్టమే కదా!" అంది నర్సమ్మ.

"ఒక్కటే అనుమానం వదినగారూ! అసలీ ఫోటో యెలా తయారయిందంటారు?" అంది విద్యుల్లతరాలు.

నర్సమ్మ బుర్ర చురుగ్గా పనిచేసింది — "మావాడు నాటకాల్లో వేషాలేస్తూంటాడు. అందులోదేమోనని నా అనుమానం. నాకు నాటకాలంటే చిరాకు. మా ఇంట్లో వాడి నాటకాల ఫోటోలు చాలా వున్నాయి. ఒక్కటి కూడా నేను చూడలేదు...."

"ఇప్పుడు నా శంక పూర్తిగా తీరిపోయింది—...." అంటూ విద్యుల్లతరాలు అప్పటికప్పుడు — ఫోటోనీ, ఉత్తరాన్నీ, కవర్నీ — అగ్గిపుల్లతో అంటించేసింది. తర్వాత ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు.

అప్పటికి పెళ్ళికూతురు వచ్చి కూర్చుంది. ఆమె చాలా అందంగా వుంది. విశ్వం ఆమె వంక నే రెప్పలార్పకుండా చూస్తున్నాడు. ఆమెకూడా ఓరకంట అతడిని గమనిస్తూనే వుంది. వాటం చూస్తే ఒకరికొకరు నచ్చినట్లే కనబడుతోంది.

నర్సమ్మ కొడుకుతో కొద్దిక్షణాలు మాట్లాడి—"మళ్ళీ వెళ్ళి ఉత్తరాలు రాస్తామనే సంప్రదాయంకాదు మాది. అబ్బాయికి పిల్ల నచ్చింది. సింపుల్‌గా వివాహం జరిగే యేర్పాట్లు చేయండి. మంచి ముహూర్తం నిర్ణయమయ్యాక మాకు కబురుపెట్టండి—" అంది.

8

"నా పథకానికి తిరుగుండదు..." అన్నాడు రంగా.

"ఆవిడ ఆ ఫోటో చూపించినప్పుడు నేను చాలా కలవరపడ్డాను. కానీ అవిదే నాకు దారి చూపించింది.." అంది నర్సమ్మ.

"ఎందుకు చూపించదరా? ఆ పిల్ల సెలా వదుల్చుకోవాలా అని చూస్తోందావిడ. సవతి కూతురంటే బొత్తిగా పడదామెకు. చాలా మంచి సంబంధాలే వచ్చాయా అమ్మాయికి. సవతికూతురెక్కడ సుఖపడిపోతుందోనని తిరగ్గొట్టిందా యిల్లాలు...." అన్నాడు రంగా—"ఇప్పుడావిడ తనే పట్టుబట్టి విశ్వంతో పెళ్ళి జరిపిస్తుంది మాలతికి...."

"కానీ...." అంది నర్సమ్మ—"ఆ ఫోటోను వాళ్ళెవరు పంపివుంటారు? అనూరాధ కాదుగదా...."

విశ్వం భయంగా—"అనూరాధే అయుండాలి. నెగటివ్సు ఆమె దగ్గరే వున్నాయి...." అన్నాడు.

రంగా నవ్వి—"మీ భయం అర్థంలేనిది. అనూరాధ తన్ను తాను రక్షించుకుందుకే ఆ నెగటివ్సుకూడా పట్టుకుపోయింది తప్పితే-ఆమె వాటితో ప్రింట్సుతీసి విశ్వాన్ని బెదిరించదు....అదామెకు క్షేమంకాదు...." అన్నాడు.

"అయితే ఆ నెగటివ్సు—ఇంకా యెవరి దగ్గరైనా వున్నాయంటావా?"

"వెర్రివాడా — అది కొత్త ప్రింటు కాదు. పాత ప్రింటే! నీ పెళ్ళి ఫోటో ఒకటి నా దగ్గరున్న విషయం మరిచావా?" అన్నాడు రంగా.

"అంటే?"

"ఈ పెళ్ళి కుదరాలని నేనే ఆ ఫోటో నీకాబోయే అత్తగారి పేరిట పంపించాను. ఆ ఫోటోయే ఈ పెళ్ళి కుదిర్చింది...." అన్నాడు రంగా.

విశ్వం తెల్లబోయి — "నువ్వు అసాధ్యుడివి—" అన్నాడు.

"నేను అసాధ్యుడనైతే సరిపోదు. నువ్వూ అలాగే

వుండాలి. ఆ ఫోటో గురించి యెప్పుడెవరడిగినా — అది నాటకంలోని దృశ్యమని చెప్పడం మరిచిపోకు—"
అన్నాడు రంగా.

"చెప్పడానికి నా యింట్లోకూడా అలాంటి ఫోటో లుండాలి కదా....అసలు మా ఇంట్లో నేను నాటకాల్లో వేషాలేసిన ఫోటోలే లేవు...."

నర్సమ్మ చిరాగ్గా—"బాగుంది—ఇదేమైనా కోర్టను కున్నావా - సాక్ష్యాధారాలన్నీ తెచ్చి చూపించడానికి- ఆల్బం ఏ ప్రయాణంలోనో పోయిందనొచ్చు...." అంది.

"చూడు - మీ అమ్మను చూసి తెలివి పెంచుకో -" అన్నాడు రంగా.

వాళ్ళలా కబుర్లు చెప్పుకుంటూండగా చటుక్కున యెవరో లోపలకు వచ్చారు. విశ్వం వచ్చిన వ్యక్తిని చూసి కంగారుగా లేచి నిలబడి - "అరే - మామయ్య గారు-" అన్నాడు.

"అప్పుడే నన్నలా పిలిచేయకు బాబూ!" అన్నాడాయన.

"ఏమిటన్నయ్యగారూ—హడావుడిగా కనబడుతున్నారు! అప్పుడే ముహూర్తం పెట్టించుకొని వచ్చేశారేమిటి?" అంది నర్సమ్మ.

ఆయన తన లాల్చీ పక్క జేబులోంచి ఓ కవరుతీసి విశ్వాని కందించి - "ఇందులో మొత్తం పది ఫోటో లున్నాయి. వాటి గురించి నువ్వే చెప్పాలి-" అన్నాడు.

విశ్వం ముందు కాబోయే మామగారికి కుర్చీ చూపించి తనప్పుడా ఫోటోలను చూశాడు. అవన్నీ అతడికీ, అనూరాధకూ వివాహమైన పెళ్ళి ఫోటో కాపీలు. విశ్వం ఆ ఫోటోలను మౌనంగా రంగాకు అందించాడు. రంగా

ఆ ఫోటోలు చూసి తడబడుతూ — "ఇవి మీకెలా వచ్చాయి?" అన్నాడు.

"మా యింటిపక్క అటు అయిదిళ్ళు, ఇటు అయిదిళ్ళవాళ్ళకి వచ్చాయివి—" అన్నాడు వచ్చినాయన. ఆయన చెప్పిందాన్నిబట్టి వాళ్ళకర్థమైన విషయమేమిటంటే—ఎవరో ఆ పదిమందికీ ఈ ఫోటోతోపాటు ఓ ఉత్తరంకూడా ఇచ్చారు—అందులో "ఇలాంటి ఫోటోలే మాలతి తల్లికీ పంపాం. కానీ ఆమె సవతి తల్లి కదా! అందుకని మాలతి పెళ్ళి ఆ పెళ్ళైన వాడితోనే జరిపేయబోతోంది. ఇరుగూ పొరుగూ అయిన మీరైనా కలగజేసుకొని ఈ పెళ్ళి ఆపాలి ...." అని వుందిట. వాళ్ళంతా మాలతి ఇంటిమీద దాడిచేసి సవతి తల్లిని నానా మాటలూ అనడమే కాక—మాలతి తండ్రినికూడా—నువ్వు తండ్రివా, కసాయివాడివా అని దూషించారుట. అటు లోకాపవాదుకీ ఇటు కూతురి భవిష్యత్తుకీ భయపడి ఆయనిలా పరుగున వచ్చాడుట.

విశ్వం వెంటనే-"నేనో నాటకంలో వేషం వేశాను. ఆ ఫోటోలా నాటకంలోనివే! నా నాటకాల ఫోటో ఆల్బం మొన్న ప్రయాణంలో పోయింది—" అన్నాడు.

"అయితే ఈ ఫోటో లెవరు పోస్టుచేశారు—ఎందుకు చేశారు?" అన్నాడు వచ్చినాయన.

"ఈయన నా మిత్రుడు. పేరు రంగా. ఇతడే ఆ ఫోటోలన్నీ పోస్టుచేశాడు. అమ్మాయిమీద చెడ్డ అభిప్రాయం ఏర్పడితే సవతి తల్లి ఈ పెళ్ళికి తప్పక ఒప్పుకుంటుందని ఇతడభిప్రాయం...." అన్నాడు విశ్వం.

వచ్చినాయన వెర్రిముఖంవేసి—"ఇలాంటి పని శత్రువులే తప్ప మిత్రులు చేయరు-...." అన్నాడు.

రంగా వెంటనే — "అయ్యో! మీ యింట్లో కథ అందరికీ తెలుసు. ఆ యింట్లో మీ ఆవిడమాటతప్ప ఇంకెవ్వరిదీ చెల్లదు. అబ్బాయి గురించి అనుమానాలుంటే ఆవిడకిష్టం. అమ్మాయి సుఖపడితే మీకిష్టం. మీరీ పెళ్లి కాదనకండి. ఆవిడ కాదనదు. ఉభయతారకంగా ఉంటుందీ ఫోటోలవల్ల ...." అన్నాడు.

వచ్చినాయన కంగారుగా — "నేను కన్న తండ్రినే కానీ కసాయివాణ్ని కాను. ఈ పెళ్లి కొప్పుకొని నలుగురి చేతా ఛీ అనిపించుకోలేను. మీ వ్యవహారం చాలా తిరకాసుగా వుంది. వస్తాను...." అనేసి అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

ముగ్గురికి ముగ్గురూ తెల్లబోయారు. ముగ్గురిలోకీ ముందు నర్సమ్మ తేరుకొని—"కొరివితో తలగోక్కోవడమంటే ఇదే.... వాళ్ళకీ ఫోటోలు పంపడం చాలా తెలివితక్కువ పని—" అంది.

"నేనేమంత తెలివితక్కువవాణ్ని కాదు. ఈ ఫోటోలు నేను పంపలేదు—" అన్నాడు రంగా.

"ఇందాకా నువ్వే పంపానన్నావు!" అన్నాడు విశ్వం.

"అందుకు కారణముంది—" అన్నాడు రంగా— "నువ్వసలే పిరికివాడివి. ఆ ఫోటో లెవరో పంపారని తెలిస్తే వాళ్ళ సంగతెలాగున్నా ముందు నువ్వే భయపడి పెళ్లి వద్దంటావని భయపడి అలా చెప్పాను. దాంతో నువ్వు ఆ తర్వాత నీ మామగారు తెచ్చిన ఫోటోలు కూడా చూసి అవీ నేనే పంపి ఉంటాననుకున్నావు...."

"అయితే ఈ ఫోటో లెవరు పంపారంటావు?"

"ఇంకెవరు? నెగటివు లెవరిదగ్గరున్నాయో-వాళ్ళు!"

"అంటే—అనూరాధా?"

"అవును—ఆమే!"

"ఇందువల్ల ఆమెకు ప్రయోజనం?"

"ప్రయోజనమేమిటీ-నీకింకా అర్థం కాలేదా? ఆమెకు మన గురించి పూర్తిగా తెలిసిపోయింది. ఇప్పుడామె మన ప్రయోజనాలకి అడ్డం వస్తుంది...."

"మొత్తంమీద ఈ పెళ్లి చెడగొట్టింది...." అంది నర్సమ్మ.

"పెళ్ళెక్కడ చెడింది-? ఈ పెళ్లి జరిపించే బాధ్యత నాది!" అన్నాడు రంగా లేచి నిలబడుతూ.

"పెళ్లికూతురి తండ్రి వచ్చి ముఖంమీద కుండబద్దలు కొట్టినట్లు మీ సంబంధం వద్దని చెప్పిపోయాక కూడా-ఇంకా పెళ్లి జరుగుతుందంటావేమిటీ? నువ్వు తెలివిలో ఉండే మాట్లాడుతున్నావా?" అంది నర్సమ్మ.

"ఈ దేశంలో ఆడపిల్లల సంగతి మీకంటే నాకు బాగా తెలుసు—" అన్నాడు రంగా.

"పెళ్లి కుదిరితే మాత్రం - అనూరాధ నన్నొదిలిపెడుతుందనుకోను. ఆమె సాక్ష్యాలు పట్టుకొని బయల్దేరిందంటే నేను జైలు పాలవుతాను-" అన్నాడు విశ్వం.

"ఎందుకని?"

"ఒక భార్య బ్రతికుండగా రెండో భార్యను తెచ్చుకోవడం చట్టరీత్యా నేరమని నీకు మాత్రం తెలియదా?" అన్నాడు విశ్వం.

"ఓహో నీ భయం?" అని నవ్వాడు రంగా - "నీకు నేను హామీ యిస్తున్నాను. నీకు మాలతితో వివాహమయ్యేసరికి అనూరాధ బ్రతికుండదు-"

నర్సమ్మ, విశ్వం ఉలిక్కిపడి రంగా వంక చూశారు. అతడి కళ్ళలో వారికి హెచ్చరిక కనబడింది.

9

రంగా అంచనా తప్పుకాలేదు. అతను విశ్వాన్ని తీసుకొని మళ్ళీ మాలతి యింటికి వెళ్లాడు. స్వయంగా మాలతితో మాట్లాడాడు. విశ్వం శీలాన్నీ గుణగుణాల్నీ విపరీతంగా పొగిడాడు.

విశ్వం మాలతితో—"నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నాకు భార్యగా నువ్వు సుఖం తప్ప మరొకటి రుచి చూడవు. ఆ ఫోటోలు వట్టి నాటకం. వాటిని చూసి మనసు పాడుచేసుకోకు-...." అన్నాడు.

మాలతి అతడి మాటలకు కరిగిపోయింది. ఆ యిల్లొక నరకంలా వున్నదామెకు. ఏదోవిధంగా అందులోంచి బయటపడాలనుకుంటోంది. విశ్వం మోసగాడైతే తర్వాత చూసుకోవచ్చు.

"ఈ పెళ్లి నాకిష్టమే!" అని చెప్పిందామె. విశ్వం మాలతి తండ్రితో-"మీ అమ్మాయిష్టపడింది. ఆమెకు మైనారిటీ తీరిపోయింది కాబట్టి మేమిద్దరం మిమ్మల్నెదిరించికూడా వివాహం చేసుకోగలం-" అన్నాడు.

పెద్ద యిబ్బందేమీ లేకుండా ఆ రాత్రే అక్కడ గుళ్లో పెళ్లి జరిగింది. విశ్వం మాలతిని తీసుకొని వెళ్ళయిపోయిన మర్నాడే తన యింటికి వచ్చేశాడు. నర్సమ్మ యింట్లో కోడలికి స్వాగతం పలికి-"నన్ను పిలవకుండా నే పెళ్లి చేసుకొచ్చేశారూ-" అంది కొడుకుతో. కానీ ఆవిడ ముఖంలో బాధ లేదు.

మాలతికి అంతా విచిత్రంగా వుంది.

ఇలాంటి పెళ్ళెక్కడైనా వుంటుందా?

తండ్రి లోకాపనిందకు భయపడి ఈ పెళ్లి వద్దన్నాడు. తనేమో నరకంలోంచి బయటపడాలని ఈ పెళ్లికి ఒప్పుకుంది. ఒప్పుకున్న మరుక్షణం పెళ్లి. అటుపైన అత్తవారింటికి ప్రయాణం. పెళ్లికి అత్తగారు రానేలేదు.

మాలతికి సందేహాలకు చాలకన్నట్లు "నీకు పెళ్ళయిందనిగానీ - నువ్వు మా అబ్బాయి భార్యవనిగానీ చుట్టుపక్కల ఎక్కడా అనకు-" అంది నర్సమ్మ కోడలితో- ఆమె కాపురానికి వచ్చిన ఓ గంట అనంతరం.

"ఎందుకని?"

"అన్నీ నీకే అర్థమవుతాయి తొందర్లో...." అంది నర్సమ్మ.

విశ్వం బయటకు వెళ్లిపోయాడు. ఇంట్లో అత్తాకోడళ్ళు మిగిలారు. మధ్యాహ్నం రెండింటికి నర్సమ్మ నిద్రపోయింది. మాలతికేమీ తోచక దొరికిన పుస్తకమొకటి తీసింది.

అప్పుడెవరో గుమ్మం దగ్గర నిలబడ్డారు.

మాలతి తలెత్తి చూసింది. ఓ అందమైన యువతి. ఆమె నెక్కడో చూసినట్లుంది.

"కంగ్రాట్యులేషన్స్ మిసెస్ మాలతీ!" అందా యువతి.

"నువ్వెవరో నాకు తెలియదు...." అంది మాలతి. "మా అత్తగారిని పిలుస్తాను."

"పాపం-ఆవిడ మంచి నిద్రలో వుంటుంది. ఇప్పుడు లేపకు. నేను నీ కోసమే వచ్చాను. నన్ను నువ్వింకా గుర్తుపట్టలేదా? నీ శ్రీవారితో నాటకంలో వేషం వేశాను" అందా యువతి.

మాలతికి గుర్తొచ్చింది. తమ వీధిలో పంచిపెట్టబడిన

పెళ్ళి ఫోటోలో విశ్వం పక్కన పెళ్ళికూతురిలా కూర్చుందామె.

"నీ పేరు?"

"అనూరాధ.."

"మీరిద్దరూ వేసిన ఆ నాటకం పేరేమిటి?"

"జీవితం-" అంది అనూరాధ.

"ఆ ఫోటో చూడ్డానికి నాటకం ఫోటోలా లేదు. అచ్చం నిజం పెళ్ళి ఫోటోలాగుంది.." అంది మాలతి.

"చెప్పానుగా - ఆ నాటకం పేరు జీవితమని!" అంది అనూరాధ.

"నిలబడే వున్నావు. కూర్చో!" అంది మాలతి.

"ఈ యింట్లో నిలబడవలసినదాన్ని నేను. కూర్చోవలసినదానివి నువ్వు.." అంది అనూరాధ.

మాలతి ఆమె వంకే పరీక్షగా చూస్తూ - "నువ్వు చాలా అందంగా వున్నావు. నాటకాలేం కర్మ— ప్రయత్నిస్తే నీకు సినిమా ఛాన్సుకూడా తగలొచ్చు.." అంది.

అనూరాధ నవ్వి - "అందం ఆడదానికి వరమని నువ్వు భావిస్తున్నట్టున్నావు. ఆడదానికి పెళ్ళయితే ఆ వరం మగాడిదే అవుతుంది-" అంది.

"నీకు పెళ్ళయిందా?" అంది మాలతి.

"ఆఁ నాటకంలో.." అంది అనూరాధ - "నేను నీ అదృష్టానికి నిన్నభినందించాలని వచ్చాను. పెళ్ళిఫోటోలో మా యిద్దర్నీ చూడ్డంవల్ల నీకు కలిగిన అపోహ లేమైనా వుంటే తొలగించాలని వచ్చాను.."

"చాలా థాంక్స్!" అంది మాలతి.

"ఎందుకూ అనడగనంటే నాదో సలహా నీకు..."

అనాగింది అనూరాధ.

మాలతి ఆమె వంక కుతూహలంగా చూసింది.

"నీ కంట్లో అనారోగ్యంగా వున్నదని చెప్పి నీ భర్తను కొంతకాలంపాటు దగ్గరగా రానివ్వకు. నీ భర్త నమ్మకపోతే లేడీ డాక్టర్నికలు. డాక్టర్ ప్రభాదేవికి నా పేరు చెప్పావంటే నువ్వు కోరిన రిపోర్టిస్తుంది..." అంది అనూరాధ.

మాలతి తెల్లబోయి - "ఇదంతా ఎందుకు?" అంది.

"నా సలహా అయిపోలేదు. నీ పెళ్లి సింపుల్‌గా జరిగినా పెళ్లి ఫోటోలు తీశారుగదా? వాటి నెగెటివ్సు సంగ్రహించి దాచుకో."

"ఎందుకు?"

"అవన్నీ నేను మళ్ళీ నిన్ను కలిసినపుడు చెబుతాను. ప్రస్తుతానికి నేను చెప్పినది తూచా తప్పకుండా పాటించాలి..."

"పాటించకపోతే?"

"అది నీ దురదృష్టం. నేను నీ మేలుకోరి చెబుతున్నాను. గుర్తుంచుకో. నేను మళ్ళీ నిన్ను కలుస్తాను...." అని చటుక్కున వెనక్కు తిరిగి చరచరా వెళ్ళిపోయింది అనూరాధ.

10

గదిలో మల్లెల పరిమళం గుప్పుమంటోంది. మంచం మీద ముడుచుకుని కూర్చుంది మాలతి.

రాత్రి పదింటికి విశ్వం గదిలో అడుగుపెట్టి తలుపులు వేశాడు.

మాలతి గుండె దడదడా కొట్టుకుంది.

విశ్వం ఆమెను సమీపించి చుబుకం పైకెత్తాడు.

మాలతి బరువుగా కనురెప్పలు వాల్చేసింది.

"అందానికి మారు రూపానివి నువ్వు. నువ్వు నా భార్యవు కావడం - ఎన్నో జన్మల అదృష్టం-" అన్నాడు విశ్వం.

"అదృష్టం మీది కాదు - నాది!" అంది మాలతి.

విశ్వం ఆమె పక్కగా కూర్చుని - "నాది పొరపాటే! ఇకమీదట జీవితంలో - నీ, నా అని వేరే లేవు. అన్ని అనుభవాలూ మనవి!" అన్నాడు.

మాలతి మాట్లాడలేదు. అతడామె నడుంచుట్టూ చేయి వేసి - "ఇన్నాళ్ళవు నాటకాల్లో నేకాక నిజంగా కూడా ఓ భార్యను సంపాదించుకున్నాను-" అన్నాడు.

మాలతికి నాటకాలనగానే మధ్యాహ్నం వచ్చిన అనూరాధ గుర్తొచ్చింది. ఆమె మృదువుగా అతడిచేయి నడుంమీంచి తీసి — "నన్ను మీరు క్షమించాలి. నా ఆరోగ్యం బాగాలేదు...." అంది.

"ఏమయింది నీకు?" అన్నాడు కంగారుగా విశ్వం.

"ఏమయిందో చెప్పలేను. ఏదోలాగుంది...." అంది మాలతి.

"తొలిరేయి కదా - అలాగే వుంటుంది - "అన్నాడు విశ్వం.

"అలాకాదండీ - వళ్ళంతా సూదులు గుచ్చినట్లు ఏదో బాధ. మీరు వంటిమీద చేయివేయగానే పుండుమీద కారం జల్లినట్లుగా అనిపించింది...." మాలతి తన బాధను వర్ణించి చెప్పసాగింది.

విశ్వం ఆమె వంక అనుమానంగా చూసి - "ఈ బాధ నీకిప్పుడే ప్రారంభమైందా?" అన్నాడు.

"లేదండీ-చాలా రోజుల్నించి వుంది. మా అమ్మకు

చెప్పటం లేవి నేదికాదు. మా నాన్నగారికూడా చెప్పు కున్నానాఖరికి. అప్పుడాయన నన్నీ ఊరే తీసుకొద్దా మనుకున్నారు. కానీ అమ్మ ఒప్పుకోలేదు. ఈ ఊళ్ళో డాక్టర్ ప్రభాదేవి అని ఒకామె ఉన్నారుట. మీరు అనుమతిస్తే రేపొక్కసారి ఆ డాక్టర్ని చూద్దాం...." అంది మాలతి.

డాక్టర్ ప్రభాదేవి పేరు వినగానే విశ్వానికి కళ్ళు తిరిగినట్లనిపించింది. ఇంచుమించు ఇలాగే జరిగింది మొదటి భార్య విషయంలోకూడా.

"సరే-నీ యిష్టం...." అని అతడు మంచంమీద ఓ మూలగా జరిగి కూర్చున్నాడు. మాలతి అక్కడే కూర్చుంది. భర్త ఇంకేమీ అనకపోవడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. అలా కాసేపు గడిచాక విశ్వం మంచంమీద నడ్డి వాల్చాడు. అతడు భార్యవైపు చూడను కూడా చూడ లేదు.

మాలతి ఆలోచనలో పడింది. పాపం—అతడు నిరుత్సాహ పడినట్లున్నాడు. కానీ ఎంత మంచివాడు? తన ఆరోగ్యం బాగోలేదని తెలియగానే ఏమీ బలవంతం చేయలేదు.

అతడు బలవంతం చేయకపోవడానికి కారణం వేరే వుందని ఆమెకు తెలియదు. మాలతి ఆరోగ్యం బాగో లేదనీ, డాక్టర్ ప్రభాదేవిని కలుస్తాననీ అనగానే అతడి కేదో అపశ్రుతిలా తోచింది. మాలతికి తనగురించి యేదో సమాచారం తెలిసిందనీ—తననుంచి ఆమె ఏదో రాబట్టా లనుకుంటోందనీ అతడికనుమానం కలిగింది. ఆమె పోలీసుల మనిషి కాదుగదా అనికూడా అతడు అనుమానించాడు. అందుకే అతడు తీవ్రాలోచనలో పడ్డాడు.

"ఏమండీ!" అంది మాలతి.

విశ్వం ఆలోచనల్లోంచి తేరుకుని ఉలిక్కిపడి—"ఊఁ" అన్నాడు.

"కోపం వచ్చిందా?" అంది మాలతి మళ్ళీ.

"ఎందుకు?"

మాలతి క్షణమాత్రం తటపటాయించి — "భార్యా భర్తల మధ్య రహస్యాలుండకూడదంటారు. కానీ మీరు నా దగ్గర చాలా దాచారు...." అంది.

"ఏం దాచాను?" అన్నాడు విశ్వం. తనలో కలిగిన కలవరపాటును బయటపడకుండా వుండాలని అతడు పొడిగా ఆ ప్రశ్న వేశాడు.

"అనూరాధ గురించి నాకు చెప్పలేదు...."

"అనూరాధ..అనూరాధ ఎవరు?" అన్నాడు విశ్వం. ఈసారి దాచుకుందామన్నా అతడి గొంతులో కలవరపాటు దాగలేదు.

"అదే—జీవితమనే నాటకంలో మీ పక్కన పెళ్ళికూతురుగా కూర్చున్న అమ్మాయి...." అంది మాలతి అమాయకంగా.

"ఏమిటి నువ్వంటున్నది?" అన్నాడు విశ్వం.

అప్పుడు మాలతి అతడికి అనూరాధ మధ్యాహ్నం ఇంటికి వచ్చి తనతో మాట్లాడిన విషయం చెప్పి—"ఆమె నాతో అలా యెందుకు మాట్లాడిందో అర్థంకాలేదు. అయినా ఆమె చెప్పినట్టే చేశాను. కానీ మిమ్మల్ని చూస్తే జాలేసి నిజం చెప్పేశాను...." అంది.

"అనూరాధ ఇక్కడికి వచ్చిందా?" అన్నాడు విశ్వం. ఆ ప్రశ్న అతడు మాలతి నుద్దేశించి వేయలేదు. తనలో తానే ఆశ్చర్యంగా గొణుక్కున్నాడు. తర్వాత మాలతిని

మధ్యాహ్నమేం జరిగిందని శతవిధాల ప్రశ్నలు వేశాడు. అవన్నీ వినగానే ఆతడికర్ధమైపోయింది. అనూరాధ తను తప్పించుకుపోవడమే కాక — మాలతిని కూడా ఇక్కణ్నించి తప్పించాలనుకుంటోంది. తనే విధంగా తప్పించుకుందో అదే విధంగా మాలతినీ తప్పించబోతోంది.

ఎందుకు?

తన గురించి పూర్తిగా తెలిసికూడా ఆమె తనను పెళ్లెందుకు చేసుకుంది? ఆటుపైన మాలతితో తన వివాహాన్ని భగ్నం చేయడానికెందుకు ప్రయత్నించింది? తమ వివాహం జరిగినా మాలతినింకా వదిలిపెట్టదేం?

ఆమె మాలతికింకా యేమైనా చెప్పిందా అన్న అనుమానం విశ్వాన్ని పీడిస్తోంది. కానీ మాలతి యెంత అడిగినా తనకింకేమీ తెలియదని చెబుతోంది. ఆమె ముఖం చూస్తూంటే నిజమే చెబుతోందనిపిస్తోంది. అయితే ఒకప్పుడు తనిలాగే అనూరాధను నమ్మి మోసపోయాడు. కానీ మాలతి అనూరాధ వంటిది కాదు. లేకుంటే మధ్యాహ్నం అనూరాధ వచ్చిన విషయం తనకెందుకు చెబుతుంది?

"ఏమండీ? ఆ అమ్మాయి నాకలా యెందుకు చెప్పిందంటారు?" అంది మాలతి విశ్వాన్ని కుతూహలంగా చూస్తూ.

"ఎందుకా?" అన్నాడు విశ్వం. అతడి బుర్ర చురుగ్గా పనిచేసింది.

అనూరాధ విశ్వాన్ని ప్రేమించింది. విశ్వమామెను ప్రేమించలేదు. నాటకాల్లో వేషం వేసినప్పటికీ అతడామెపై సోదర భావాన్నే ప్రకటిస్తూ వచ్చాడు. తనకు విశ్వంద్వారా లభించిన సౌఖ్యం యే అమ్మాయికీకూడా

లభించరాదన్న భావంతో అనూరాధ మాలతికలా చెప్పి వుంటుంది. డాక్టర్ ప్రభాదేవి ఆమెకు స్నేహితురాలు.

మాలతికి సమాధానం నచ్చి "-అంతే అయివుంటుంది" అంది.

విశ్వం చటుక్కున లేచి కూర్చుని ఆమెకు దగ్గరగా జరిగి నడుంచుట్టూ చేయివేసి — "పుండుమీద కారం చల్లినట్లు లేదుకదా!" అన్నాడు.

"లేదు కాబట్టే-మీకు ముందబద్ధం చెప్పినా తర్వాత నిజం చెప్పేశాను...." అంది మాలతి.

"మాలతీ—నువ్వు నా అదృష్ట దేవతవు—" అంటూ విశ్వం ఆమెను తనవైపుకు తిప్పుకుని బలంగా కౌగలించు కున్నాడు.

ఆ తర్వాత మాలతిమీద ఇంకేమైనా అనుమానా లుంటే అవన్నీ పూర్తిగా తొలగిపోయాయతడికి. ఆమె అమాయకురాలన్న విషయంలో అతడికింకేమీ సందేహం మిగల్లేదు.

11

మర్నాడుదయం ఉత్సాహంగా నిద్రలేచాడు విశ్వం. ఇదివరకటి పెళ్ళిలాంటిది కాదీసారి. ఇప్పుడు తన భార్య నిజంగానే తనకిల్లాలయింది. అతడికెంతో సంతోషం గానూ, మనసు తేలికగానూ వుంది.

ఇప్పుడు మాలతి గతంలోని అనూరాధలాకాక తన కాలికింద చెప్పులా పడి వుంటుంది. తనేం చెబితే అది చేస్తుంది. అనూరాధ అనుకోకుండా తనను దెబ్బతీయ డంతో మళ్ళీ తనకిలాంటి అవకాశం వస్తుందా అని భయపడ్డాడు. కానీ అదృష్టం తనను వరించింది.

నాలుగైదేళ్ళలోనే తను బంగళా కొంటాడు. కారు

కొంటాడు. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగం వదిలి కాలుమీద కాలువేసుకుని దర్జాగా జీవిస్తాడు. బహుశా అప్పుడు తను వేరే పెద్దింటి పిల్లను పెళ్ళికూడా చేసుకోవచ్చు.

ఇప్పుడు తను అర్జంటుగా రంగాను కలుసుకోవాలి.

విశ్వం కాఫీతాగి బట్టలు మార్చుకుని రంగా ఇంటికి బయల్దేరాడు. అతడు వెళ్ళేసరికి రంగా యింటి తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. కాలింగ్ బెల్ మ్రోగించి యెంతకీ యెవరూ రాకపోవడంతో అతడే తలుపులు తోసుకుని లోపలకు వెళ్ళాడు.

"ప్లీజ్ — కమిన్!"

తియ్యని గొంతు....

ఎదురుగా సోఫాలో కూర్చుని వుంది అనూరాధ.

"నువ్వా?" అన్నాడు విశ్వం.

"అవును. నువ్వు రంగాకోసం వచ్చావు. నేను నీకోసం ఇక్కడ కూర్చున్నాను. రంగానే కలుసుకోవాలంటే టూ టౌన్ పోలీసుస్టేషనుకు పరుగెట్టు. రంగా పోలీస్ స్టేషన్లో యెందుకున్నాడో తెలుసుకోవాలంటే — ఇలా వచ్చి నాకెదురుగా చేతులు కట్టుకుని నిలబడు...." అంది అనూరాధ.

"నీకెంత ధైర్యం....?" అని అతడింకా యేదో అనబోయి ఆగిపోయాడు. అనూరాధ చేతిలో రివాల్వరుంది. అది అతడికే గురిపెట్టబడి వుంది.

"నా ధైర్యమే నీ బలహీనత. నీ బలహీనతే నా ధైర్యం. నేను చెప్పినట్లు నా ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడు...." అంది అనూరాధ.

విశ్వం విధిలేక ఆమె చెప్పినట్లే చేశాడు.

"పాపం — రంగా జైలుపాలయ్యాడు. నువ్వూ జైలు

పాలు కావలసిందే-నాటకంలో నై తేనేం-నా మెడలో తాళికట్టావుకదా అన్న జాలికొద్దీ నేనే నిన్ను రక్షించాను...."

"ఏమిటి__రంగా చేసిన తప్పు...."

"రంగా గురించి నేను నీకు చెప్పాలా?"అంది మాలతి.

రంగాదో వింత వ్యాపారం. స్వతంత్ర భావాలు కలిగిన అందమైన యువతుల్నీ, అసహాయులైన అందమైన యువతుల్నీ వివిధ ప్రాంతాలు తిరిగి స్పాట్ చేస్తాడతను. ఆ తర్వాత అతడు కొందరిని తన మిత్రవర్గంలో చేర్పుకుంటాడు. వారికి ప్రేమ పేరు చెప్పో, మరో విధంగానో వివాహాలు జరిపిస్తాడు. ఏ యువతికైనా రంగా నిర్ణయించిన ప్రకారం వివాహం కాగానే ఆమె ఫోటో దేశంలో పేరెన్నికగన్న ఎన్నో హోటల్సుకి చేరుకుంటుంది.

డబ్బు సమాజాన్ని నడిపించే పెద్ద తోవల్లో వివాహిత స్త్రీలపై మోజు ఒకటి. రంగా చేతిలోని కీలుబొమ్మలైన అతడి మిత్రులు వ్యభిచారం చేయించడానికే వివాహమాడతారు. వారివద్దకు వచ్చే కస్టమర్సు కూడా బాగా డబ్బున్నవారయుంటారు. వచ్చే డబ్బులో సగం వాటం రంగాది. అయినప్పటికీ యేడాదికి లక్షరూపాయలకు తక్కువకాకుండా యే భర్తయినా సంపాదించుకోవచ్చు. తమకొక్కవలసింది సంపాదించుకున్నాక భార్యను యే వ్యభిచార గృహానికో అమ్మేసినా అమ్మేయవచ్చు.

ప్రేమ మైకంలో పడ్డ యువతులు అయినవాళ్ళకు దూరమవుతారు. అసహాయులైన యువతులకు అయిన వాళ్ళుండరు. తన వివాహ కార్యక్రమాలకు రంగా అటు

వంటి యువతులనే యెన్నుకుంటాడు. వారికి వివాహా లైనాక వ్యభిచారిణులుగా మార్చడం పెద్ద కష్టంకాదు. మన సమాజంలో భర్త తలచుకుంటే భార్య చేత ఏమైనా చేయించగలడు. ప్రత్యక్షంగా అతడు చెప్పకపోయినా పరోక్షంగా అతడు సహకరించినా చాలు.

ఈ విధంగా రంగా బాగా డబ్బు సంపాదించాడు. అతడిపైన యెవ్వరికీ అనుమానంలేదు. ఎందుకంటే బాగా పకడ్బందీగా ఉంటుందతడి పథకం.

ఏదో నేర పరిశోధనలో డిటెక్టివ్ వెంకన్న ఓ వ్యభిచారిణిని కలుసుకుని—ఆమెనా మురికికూపంలోంచి రక్షించాడు. ఆమె ద్వారా అతడికి రంగా గురించి తెలిసింది. రంగా విషయమై అతడు తన అనుమానాలను బలపర్చుకునేందుకు సీతారామయ్యను సాయం కోరాడు. ఆయన కుమార్తె అనూరాధగా ఈ ఊరొచ్చింది. ఉద్యోగంలో చేరింది. అన్ని యేర్పాట్లూ డిటెక్టివ్ వెంకన్నద్వారా జరిగాయి.

ఈలోగా రంగా విశ్వంను తన మిత్ర బృందంలో చేర్చుకున్నాడు. కొడుకు పెళ్ళికో పదిహేనువేలు కట్నం అడుగుదామనుకుంటున్న నర్సమ్మకు రంగా పథకం బాగా నచ్చింది. ముందుగా ఓకోడల్ని తెచ్చుకొని లక్షలు సంపాదించి ఆయిదారేళ్ళు పోయాక - ఇంకో కోడల్ని తెచ్చుకోవాలని ఆమె అనుకుంది.

ఇలా విశ్వంతో పెళ్ళి జరగ్గానే అలా ఆమె ఫోటో పెద్ద హోటళ్ళలో చేరింది. వెంకన్న రంగానో కంట గమనిస్తూ అతడి గురించి చాలా ఋజువులు సంపాదించాడు. విశ్వం, రంగాల సంభాషణలుకూడా కొన్ని రికార్డు చేశాడు.

వెంకన్న చెప్పిన ప్లాను ప్రకారం అనూరాధ విశ్వాన్ని వదిలి వెళ్లిపోయింది. ఆమెకు విశ్వంపై ప్రేమలేదు. తమ పెళ్ళి ఒక నాటకమని కూడా ఆమెకు తెలుసు. వెంకన్న చెప్పిన ప్రకారం ఆమె తన బాధ్యతను నిర్వహించింది.

ఈలోగా విశ్వం గురించి రంగా మరో సంబంధం చూశాడు. వెంకన్న ద్వారా మాలతి గురించి యెప్పటి కప్పుడు తెలుసుకున్న అనూరాధ—"ఆ అమాయకురాలి కన్యాయం జరక్కూడదు...." అని వెంకన్నను వేడు కుంది.

అందుకే ఫోటోలు పంపి ఆమెను హెచ్చరించడం జరిగింది.

"అయినప్పటికి ఆ పెళ్ళిని ఆపలేకపోయావు—" అన్నాడు విశ్వం. తను విన్నదంతా అతడికి అపరిమితా శ్చర్యాన్ని కలిగిస్తోంది.

"అందుకేగదా — నిన్న నీ భార్యను హెచ్చరించి వచ్చాను...." అంది అనూరాధ నవ్వుతూ.

"నీ హెచ్చరిక ఫలించలేదు. నా భార్య నాకు నిజం చెప్పేసింది. నువ్వొచ్చి వెళ్ళిన విశేషాలన్నీ చెప్పే సింది...." అన్నాడు విశ్వం.

"అయినా ఆమెకేం నష్టంలేదు. రంగా అరెస్ట య్యాడుకదా... నువ్వింక నీ భార్యను ఏలుకోకతప్పదు.." అంది అనూరాధ.

"నా భార్య—నా యిష్టం.. "

అనూరాధ అదోలా నవ్వి — "నీకా స్వతంత్రం లేకుండా చేయాలనే ఈ నాటకమంతా ఆడింది. మాలతి వంటి దురదృష్టవంతురాలికి మంచి సంబంధం చేయాలనే సత్సంకల్పం నాకు కలగడంవల్లనే మీ వివాహం జరి

గింది. నీ గురించిన వివరాలు డిటెక్టివ్ వెంకన్నవద్ద వున్నాయి. మాలతి కెప్పుడే ప్రమాదం వచ్చినా ఆయన కలగజేసుకుంటాడు. అటుపైన ఇంకా పెద్ద ఆయుధం ఉండనే వుంది..." అంది.

"ఏమిటది?" అన్నాడు విశ్వం కంగారుగా.

"మన పెళ్ళి ఫోటో! మాలతికేమన్యాయం జరిగినా అది బయటకు వస్తుంది. నువ్వెక్కడ మరో పెళ్ళి ప్రయత్నం చేసినా అనూరాధ నిన్ను వెంటాడి వేటాడు తుంది. బుద్ధిగా మాలతితో కాపురం చేసుకున్నావా— నీకు మనోరమే తప్ప అనూరాధ కనపడదు. అర్థ మయిందా?"

విశ్వం తలూపాడు.

"అన్నట్లు మరో విషయం. నీ అసలు ఉద్దేశ్యం తెలియకపోవడంవల్ల కానీ కట్నం అడక్కుండా, పైసా ఖర్చులేకుండా తన్ను పెళ్ళిచేసుకున్నందుకు నిన్నారాధి స్తోంది నీ భార్య మాలతి. అరత్వ లేకన్నా అది నీ అదృష్టం. నీ భార్యకు నిజం చెప్పకపోవడమొక్కటే ప్రస్తుతానికి నేను చేయగల ఉపకారం...."

"మరి నేను వెళ్ళొచ్చా?"

"రంగా దగ్గరకు వెళ్ళకు. ఇంటికే వెళ్ళు...." అంది అనూరాధ.

విశ్వం వెనక్కు తిరిగాడు.

"ఒక్కమాట గుర్తుంచుకో. నువ్వు మళ్ళీ అనూరాధను చూడవు. చూస్తే మనోరమనే చూస్తావు ..." అంది అనూరాధ.

"అర్థమైంది—" అంటూ విశ్వం అక్కణ్ణించి బైట పడ్డాడు.

48

ఇప్పుడు తనేం చేయాలి?

రంగాను కలుసుకోవాలంటే అతడిప్పుడు నేరస్తుడు.

ఇంటికి వెళ్ళాలంటే—ఇప్పుడొచ్చిన కోడలు శాశ్వతంగా తనకు కోడలు కాబోతోందనీ—తమ జీవితం యెప్పటికీ ఇదేవిధంగా వుండబోతోందనీ—తెలిస్తే—తల్లి ఇంట్లో సుఖశాంతులు లేకుండా చేస్తుంది.

అయితే వీటన్నిటి మధ్యా మాలతి అమాయకమైన చిరునగవు అతడికి గుర్తొస్తూనే వుంది.-"అర్హత లేకున్నా అది నీ అదృష్టం—" అన్న అనూరాధ హెచ్చరికా అతడి చెవుల్లో గింగురుమంటోంది.

—: అయిపోయింది: —